క్లుప్తంగా

13నుంచి పెండింగ్ జీతాల కోసం ఆందోళన



పాల్గొన్న నాయకులు, కార్మికులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఏరియా ఆసుపత్రి వర్కర్స్ జనరల్ బాడీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో గడిచిన ఆరు నెలల నుంచి వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కాంట్రాక్టు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వేతనాల చెల్లింపుల కోసం ఈ నెల 13న కాళీ ప్లేట్లతో ఆందోళన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు సీఐటీయూ నాయకుడు రమణ తెలిపారు. సమావేశంలో కాంట్రాక్టు కార్మికులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

మట్టి రోడ్డు ధ్వంసం

కోటపల్లి: మండలంలోని ఆలుగామ గ్రామంలోని పొలాలకు వెళ్లే మట్టిరోడ్డును గుర్తుతెలియని వ్యక్తులు జేసీబీతో ధ్వంసం చేశారు. మెయిన్‌రోడ్డు మీదుగా బొప్పారం గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డుకు మరమ్మతు చేపట్టాలని మాజీ సర్పంచ్ కుమ్మరి సంతోశ్ ఇటీవల స్థానిక ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి వినతిపత్రం అందించారు. రోడ్డు పనులు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. శనివారం గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డును ధ్వంసం చేశారు. అధికారులు వెంటనే స్పందించి నిందితులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

జన్నారం: మండలంలోని రేండ్లగూడ గ్రామంలో ఉన్న శ్రీ సీతారామ దేవాలయంలో గోదాదేవి రంగనాథుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. రేండ్లగూడ గ్రామానికి చెందిన ఉత్తమ సేవ అవార్డు గ్రహీత కస్తులపురి సాగర్, వరలక్ష్మీ దంపతులు భక్తులకు భగవద్గీత పుస్తకాలు అందజేశారు. గోదాదేవి, రంగనాథుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

నిబంధనలు బేఖాతర్!

దండేపల్లి: రెండో శనివారం ప్రభుత్వ సెలవు రోజున ఓ ప్రైవేటు పాఠశాలను తెరిచి నిబంధనలు బేఖాతర్ చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు శనివారం మూసిఉన్నా మేదరిపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలను మా త్రం తెరిచి పలు కార్యక్రమాలు నిర్వహించారు. సెలవురోజు పాఠశాల తెరవడంపై విమర్శలు వ్యక్తం అయ్యాయి. ఈ విషయ మై ఎంఈవో చిన్నయ్యను ఫోన్‌లో సంప్రదించగా సెలవు రోజున పాఠశాలలు తెరవ డం నిబంధనలకు విరుద్ధమే, పాఠశాల యాజమాన్యంతో మాట్లాడతానని చెప్పారు.

యువత క్రీడల్లో రాణించాలి

జైపూర్/వేమనపల్లి/చెన్నూర్‌రూరల్: యువతను క్రీడల్లో ప్రోత్సహించడానికి పలు మండలాల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పలువురు వక్తలు సూచించారు. జైపూర్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రికెట్ టోర్నమెంట్‌ను జైపూర్ ఎస్సై శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, ఫయాజ్ ప్రారంభించారు. 30జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. వేమనపల్లిలో వేమన యూత్ ఓపెన్‌టు ఆల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వేణుమాదవ్ ప్రారంభించారు. చెన్నూర్ మండలం కిష్టంపేటలో బాల గణేశ్ మండలి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను చెన్నూర్ పట్టణ ఎస్సైలు సుబ్బారావు, వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు.

'నిధులు మళ్లించడం సరికాదు'

బెల్లంపల్లి: గ్రామపంచాయతీ భవనాల నిధులను ప్రభుత్వం దారి మళ్లించడం తగదని బెల్లంపల్లి మండల మాజీ సర్పంచ్‌లు ఇండ్ల రాజమౌళి, కారుకూరి వెంకటేష్, వేముల కృష్ణమూర్తి, బీఆర్ఎస్ అసెంబ్లీ నియోజకవర్గ అధికారప్రతినిధి కొమ్మెర లక్ష్మణ్ అన్నారు. బెల్లంపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బెల్లంపల్లి మండలంలోని ఐదు గ్రామపంచాయతీల్లో కొత్తభవనాలు, స్వశక్తి భవనాల నిర్మాణాల కోసం గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల నాయకులు అశోక్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సుమన్ పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: హాస్టల్స్ వెల్ఫేర్ సంక్షేమాధికారుల సంఘం నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను టీఎస్‌జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, జిల్లా బీసీ సంక్షేమాధికారి పురుషోత్తం నాయక్, కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్ చేతిలమీదగా జిల్లా టీఎస్‌జీవో నాయకులు శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు.

అత్యవసరమైతే మంచిర్యాలకే..

- సాయంత్రం 5 గంటలకే మందమర్రి ప్రభుత్వ ఆసుపత్రి మూత
- 24/7 సేవలందించాలంటున్న పట్టణ ప్రజలు
- ఎమర్జెన్సీ టైంలో రోగులకు తప్పని తిప్పలు



మందమర్రిలోని ప్రభుత్వ వైద్యశాల

మందమర్రిరూరల్: మందమర్రి పాత బస్టాండ్ సమీపంలోని రాష్ట్రీయ రోడ్డు పక్కన గల ప్రభుత్వ వైద్యశాలలో 24గంటలు (24/7) వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకే వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. పట్టణంలో సుమారు 60వేల మంది జనాభా ఉన్నప్పటికీ 24గంటలు వైద్య సేవలు అందుబాటులో లేవు. సాయంత్రం, రాత్రి సమయాల్లో అత్యవసర పరిస్థితులు, ప్రమాదాలు జరిగిన సమయంలో సుమారు 18 కిలోమీటర్ల దూరంలోని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు..

జిల్లాలోని మందమర్రి, తాళ్లపేట, కాసిపేట, దండేపల్లి మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గత ప్రభుత్వం ట్రైబల్ ఏరియా ఆసుపత్రులుగా గుర్తించింది. కాసిపేట, దండేపల్లి ఆసుపత్రుల్లో 24గంటల వైద్య సేవలందిస్తుండగా తాళ్లపేట, మందమర్రిల్లోని ప్రాథమిక కేంద్రాల్లో మాత్రం ఎనిమిది గంటలే వైద్య సేవలందిస్తున్నారు. మందమర్రి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ 24గంటల వైద్య సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారు. ఇక్కడి ఆసుపత్రిలో తగినంత సిబ్బందితో పాటు, పలు రకాలైన వైద్యం కూడా చేయడానికి అన్ని రకాల పరికరాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఆరు బెడ్ల సామర్థ్యం గల ఈ ఆసుపత్రిలో ప్రసవాలు, రక్త పరీక్షలు, టీబీ, మూత్ర పరీక్షలు కూడా చేస్తారు. కానీ ఉదయం నుంచి సాయంత్రం వరకే సిబ్బంది విధుల్లో ఉండడంతో సాయంత్రం, రాత్రి సమయాల్లో ఏమైనా అవసరమైతే ఇబ్బంది తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంచిర్యాలకు వెళ్లాల్సిందే..

మందమర్రిలోని ప్రభుత్వాసుపత్రిలో 24గంటల వైద్య సేవలు లేకపోవడంతో పట్టణంలో ప్రజలకు సాయంత్రం, రాత్రి సమయాల్లో పాము కాటు, కుక్క కరిచినా, హార్ట్ ఎటాక్, విష జ్వరం, కడుపునొప్పి, అనుకోని ప్రమాదాలు తదితర పరిస్థితుల్లో 108అంబులెన్స్ ద్వారా మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి వెళ్లాల్సిందే. మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి చేరుకోవాలంటే పేషెంట్‌కు సుమారు గంట సమయం పడుతుంది. ఈ లోగా ప్రథమ చికిత్స చేయకపోతే ఆ మనిషి చనిపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందమర్రిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉంటే పేషెంట్ ప్రాణం దక్కుతుందని ప్రజలు సూచిస్తున్నారు.

24గంటల సౌకర్యం కోసం కృషి

మందమర్రిలో 24గంటల వైద్య సేవల ఏర్పాటుకు కృషి చేస్తా. హెచ్‌ఆర్, అదనపు సిబ్బంది, గైడ్‌లైన్స్ విధివిధానాలు పరిశీలిస్తున్నాం. 24గంటల వైద్య సేవలు అందుబాటులో ఉంటే ఇబ్బంది కలగకుండా ఉంటుందని గుర్తించాం. తప్పకుండా 24గంటలు సేవలు అందిస్తాం.

\- హరీశ్‌రాజ్, డీఎంహెచ్‌వో

24 గంటలు వైద్యసేవలు అందించాలి



మందమర్రిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలున్నప్పటికీ 24గంటలు వైద్య సేవలు అందడంలేదు. చిన్నపాటి జ్వరం వచ్చినా ప్రైవేట్ వారిని ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. పాము కరిచినా, కుక్క కాటు వేసినా, ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినా మంచిర్యాలకు వెళ్తున్నాం. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఆలోచించి మందమర్రిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24గంటల వైద్యసేవలందించాలి.

\- అబ్బాస్, యాపల్ ఏరియా, మందమర్రి

సద్వినియోగం చేసుకోండి



మందమర్రిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. రోజుకు సుమారు 80 నుంచి 120మంది వరకు పేషెంట్స్‌కు సేవలు అందిస్తున్నాం. గర్భిణులకు ప్రసవాలు, రోగులకు అన్నిరకాల పరీక్షలు చేయడానికి ల్యాబ్ సౌకర్యం కూడా ఉంది. మున్సిపాలిటీ, మండల వ్యాప్తంగా 10 పల్లె దవాఖానాలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

\- రమేశ్, మెడికల్ ఆఫీసర్, మందమర్రి

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

చెన్నూర్: ప్రభుత్వం చేనేత కార్మికులు, చేనేత రంగా అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.165 కోట్ల నిధులు మంజూరు చేయడంపై చెన్నూర్ చేనేత సొసైటీలో శనివారం చేనేత పాలక వర్గ సభ్యులు, కార్మికులు సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షులు కిష్టయ్య, చెన్నూర్ చేనేత సొసైటీ కార్యదర్శి బల్ల శశికుమార్, కార్మికులు పర్శా రంగయ్య, మల్లయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

జన్నారం: మండలంలోని పొనకల్ శివారులో గల వీర్లగుట్టపై వెలసిన శ్రీ కేతేశ్వర కంకాలమ్మ శివాలయం జాతరకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఉట్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆవిష్కరించారు. ఈ నెల 19న కేతేశ్వర జాతరకు తప్పకుండా హాజరుకావాలని ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ నిర్వాహకులు ఆహ్వానం పలికారు.

నియామకం

తాండూర్: వాసవీ క్లబ్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా తాండూర్‌వాసి సిర్ప శ్రీకాంత్ ఎన్నికయ్యారు. శ్రీకాంత్ ఎన్నికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రఘునాథ్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని వెర్రబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్ కబడ్డీ క్రీడాపోటీలను ప్రారంభించారు. క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని, స్ఫూర్తిదాయకంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హరిగోపాల్, హేమంత్‌రెడ్డి, కృష్ణమూర్తి, ప్రభాకర్, వెంకటరామన్, శ్రీనివాస్, కిషన్, నరేష్, పాంచాల రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: తనను బీజేపీ మంచిర్యాల పట్టణ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు గాను పార్టీని పటిష్టం చేసేందుకు కృషి చేస్తానని అమిరిశెట్టి రాజు అన్నారు. ఇటీవల బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా నియామకం అయినందుకు గాను కృతజ్ఞతగా ఆ పార్టీ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లిని శనివారం కలిసిన రాజు కృతజ్ఞతలు తెలిపారు.

గని జీవితకాలం ఏడాదే

- ఆర్కే 6 గనిమేనేజర్ తిరుపతి



మాట్లాడుతున్న మేనేజర్ తిరుపతి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 గని జీవితకాలం మరో ఏడాదే మిగిలి ఉందని ఆ గని మేనేజర్ తిరుపతి తెలిపారు. తన చాంబర్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్కే 6 గని 50ఏళ్లుగా బొగ్గు ఉత్పత్తి చేస్తుందన్నారు. ఇప్పటికీ 13.95మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీసినట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు సీముల్లో బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని, 6 ఎస్‌డీఎల్ యంత్రాల ద్వారా బొగ్గు వెలికితీస్తున్నామన్నారు. మిగిలి ఉన్న బొగ్గు నిలువలు పూర్తిగా తీస్తే వచ్చే సంవత్సరం నాటికి గని మూసివేసే అవకాశం ఉందన్నారు. భూగర్భ గనుల్లో ఎస్‌డీఎల్ సెక్షన్‌లో అధిక ఉత్పత్తి తీసిన గనుల్లో ఆర్కే 6 గని గడిచిన 5ఏళ్లుగా కంపెనీ స్థాయిలో అవార్డు సాధించిందన్నారు. సమష్టి కృషితో దీన్ని సాధించామన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు, అధికారులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో గని సేఫ్టీ అధికారి కాదాసి శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి రామ్ నరసయ్య, అధికారులు మర్రి కొమురయ్య, శ్యాం కుమార్, ఎస్పీ వర్మ, సంక్షేమ అధికారి సురేందర్ పాల్గొన్నారు.

■ **బొగ్గుబాయి వార్తలు**

సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీరాంపూర్: మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్‌మెన్, ఎస్‌డీఎల్ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. ఆర్కే 7గనిని శనివారం ఆయన సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు గరిగే స్వామి, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘంలో చేరిక

శ్రీరాంపూర్: డిస్మిస్ కార్మిక సంఘంలో క్రియాశీలకంగా పనిచేసిన గుంపుల సారయ్య తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘంలో చేరారు. నస్పూర్‌కాలనీలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవి సత్యనారాయణ సారయ్యకు యూనియన్ కండువా కప్పి స్వాగతం పలికారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(140/2018) నూతన సంవత్సరం క్యాలెండర్‌ను తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆవిష్కరించారు. హైదారాబాద్‌లోని ఆయన చాంబర్‌లో శనివారం అసోసియేషన్ నాయకులు సమక్షంలో ఆవిష్కరించారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



మంచిర్యాలలో విజేతలతో నిర్వాహకులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని గోదావరి రోడ్డులో గల హరినిలయ విల్లాస్ ప్రాంగణంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా గోనె భాగ్యలక్ష్మి, సువర్ణ, మణిమాలలు వ్యవహరించగా, 70మంది మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతి పొందిన వాణికి రూ.5వేలు, రెండో బహుమతి పొందిన సీహెచ్ రాజమణికి రూ.3వేలు, మూడో బహుమతి విజేత రాజమణికి రూ.2 వేలు, నాలుగు కన్సోలేషన్ బహుమతులను నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వి.మధుసూదన్ రెడ్డి, సూరజ్‌రావు, ఎం.శ్యామలాదేవి, వి.రజిని రెడ్డి పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని బురుదగూడెంలో గల లిటిల్ ఫ్లవర్‌హైస్కూల్‌లో శ్రీ వచా సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్ దంపతులు బహుమతులు అందించారు.

రామకృష్ణాపూర్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని పట్టణంలోని తవక్కల్ పాఠశాల, సెయింట్ జోసెఫ్స్ పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు.

13, 14తేదీల్లో తాండూర్‌లో...

తాండూర్: ఈ నెల 13, 14తేదీల్లో కబడ్డీ, తాడు గుంజుడు, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తాండూర్ యూత్ కమిటీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు మాస వెంకటస్వామి ప్రకటించారు.

'సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా'

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఆశవాహ అభ్యర్థి నరేందర్ రెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిని శనివారం ఆయన సందర్శించారు. కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్, కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్, శ్రావణ్ పాల్గొన్నారు.

హద్దురాళ్లు ధ్వంసం

వేమనపల్లి: దస్నాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న వేమనపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన హద్దురాళ్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. జిల్లా సర్వేయర్, ఎంసీ కొలతలు చేసి పాఠశాల భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. శుక్రవారం ఉదయం ఏడీఎస్ఎల్ఆర్, ఎంసీ దశరథ్ సూచనల మేరకు గ్రామస్తులు హెచ్ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. గత పదేళ్లుగా స్థలాన్ని ఆక్రమించుకుని పొలం సాగు చేసుకుంటున్న వ్యక్తి నుంచి భూమిని స్వాధీనం చేసుకున్నారు. హద్దురాళ్లు పాతిన రోజే రాత్రి ధ్వంసం చేయడం ఆక్రమణకు పాల్పడిన వారు చేసి ఉంటారని పాఠశాల సిబ్బంది తెలిపారు. ఈ విషయమై పోలీసులు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ కార్యక్రమాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పడ్తనపల్లిలో శనివారం పశుసంవర్ధక శాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ, పశువైద్య చికిత్స, కృత్రిమ గర్భధారణ కార్యక్రమాలను చేపట్టారు. మూడు నల్లజాతి పశువులకు, 19ఆవులకు ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ చర్యలు చేపట్టారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన 14దూడలకు నట్టల నివారణ మందులు వేశారు.

మాలసంఘం నూతన కార్యవర్గం

జన్నారం: మండల మాలకుల సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాముక కరుణాకర్ ఎన్నికయ్యారు.

వడ్డెర ఓబన్నకు నివాళులు

జన్నారం: మండల కేంద్రంలో స్వాతంత్ర్యవీరుడు వడ్డెర ఓబన్న జయంతి పురస్కరించుకొని వడ్డెర కులస్తులు శనివారం ఓబన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి హాజరయ్యారు.

సంక్షిప్త వార్తలు

ఉచిత కంటి ఆపరేషన్లు

చెన్నూర్: పట్టణంలో బండారి రాజేశ్వరి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బండారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించినట్లు వైద్యులు అభిషేక్ చిందం తెలిపారు.

యూనిఫాం, సబ్బులు అందజేత

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని ప్రజారోగ్య, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు శనివారం మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య సబ్బులు, నూనె, యూనిఫాం, పాదరక్షలు పంపిణీ చేశారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

శ్రీరాంపూర్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్ తెలిపారు. శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహించారు. వాహన డ్రైవర్లకు ట్రాఫిక్‌రూల్స్, రోడ్ సేఫ్టీ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్సైలు సంతోష్, లక్ష్మీ ప్రసన్న, జైపూర్ ఎస్సై శ్రీధర్ పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

నెన్నెల: మండలంలోని ఆవడం పంచాయతీని నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని శనివారం గంగారాం గ్రామస్తులు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: సెలవు రోజుల్లో నిబంధనలు అతిక్రమించి పాఠశాలలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. సమాచారం అందిన వెంటనే జిల్లా కేంద్రంలో తరగతులు కొనసాగిస్తున్న పాఠశాలలపై శనివారం ఎంఈవో దృష్టికి తీసుకెళ్లగా మూసివేసినట్లు పేర్కొన్నారు.

హార్ట్‌ఫుల్‌నెస్ ఆధ్వర్యంలో యోగా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల కేంద్రంలోని మాజీ జెడ్పీటీసీ శిల్ప నివాస గృహంలో హార్ట్‌ఫుల్‌నెస్, శ్రీరామచంద్ర మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల ఉచిత ధ్యాన శిక్షణ ప్రారంభించారు. అభ్యాసి పద్మావతి ధ్యానోత్సవం ప్రారంభించి పరిచయం చేశారు.



108రకాల గంగాజలాలతో పూజ



భీమారం: కూడారై ఉత్సవంలో పాల్గొన్న మహిళలు

ఘనంగా కూడారై ఉత్సవం

భీమారం/మందమర్రిరూరల్: ధనుర్మాసం సందర్భంగా భీమారం మండలం శ్రీకోదండరామాలయంలో, మందమర్రి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వస్వామి దేవాలయంలో శనివారం కూడారై ఉత్సవం నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గుడిపేట గోవింద క్షేత్రంలో శనివారం శ్రీరామచంద్ర రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో గోదాదేవికి కూడారై పాయసాన్న మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. 108 గంగాలలో 120లీటర్ల పాలతో తయారు చేసిన ప్రసాదాలు గోదాదేవికి ప్రసాదంగా నివేదించారు. ప్రసాద దాతలుగా సతీశ్‌రావు, కృష్ణారావు, స్వీట్ హౌజ్ రాజేశ్ వ్యవహరించగా బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు ఆధ్వర్యంలో కుడారై పాయసాన్న ప్రసాద వితరణ కనుల పండవగా జరిగింది.



గోవింద క్షేత్రంలో కూడారై ప్రసాద నివేదనలో పాల్గొన్న కమాండెంట్ వెంకటరాములు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

భీమిని: కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీగాం గ్రామ పంచాయతీలో పోలీస్ కళాబృందం శనివారం బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, గంజాయి, మద్యం తదితర వాటి వల్ల కలిగే నష్టాలపై కళాజాత నిర్వహించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కన్నెపల్లి ఎస్సై గంగారాం సూచించారు.